భూసార పరీక్షలతో మేలు

- భూముల స్వభావాన్ని బట్టి పైరు సాగు చేస్తే అధిక దిగుబడులు
- రైతులు సద్వినియోగం చేసుకోవాలంటున్న అధికారులు

ఆత్మకూరురూరల్: రైతులు తాము సాగు చేస్తున్న భూముల్లో పంటల సమతుల పోషణ కోసం భూసార పరీక్షలు ఎంతగానో ఉపయోగపడతాయని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. నేల భౌతిక, రసాయనిక లక్షణాలు సూక్ష్మ జీవుల చర్య, వాతావరణ పరిస్థితులపై ఆధారపడి ఉంటాయి. ఈ నేపథ్యంలో భూముల స్వభావాన్ని బట్టి తగిన పైరు సాగు చేస్తే అధిక దిగుబడులు సాధించడంతోపాటు రైతులు ఆర్థికంగా లాభాలు పొందవచ్చని చెబుతున్నారు. ఏ నెలలో ఏ పంట వేస్తే మంచి దిగుబడులు వస్తాయో వివరించారు.

భూసార పరీక్షలు చేయించుకొనే విధానం

పొలంలో 15–20 సెంటీమీటర్ల వరకు త్రిభుజాకారంలో గుంత తీసి అందులో పై పొర నుంచి కింద పొర వరకు ఒక పక్కన మట్టిని సేకరించాలి. ఒక్కో ఎకరం విస్తీర్ణంలో 5 నుంచి 10 చోట్ల ఈ విధంగా సేకరించిన మట్టిని ఒకే చోట చేర్చి బాగా కలిపి దానిని 4 భాగాలు చేయాలి. అందులో ఎదురెదురు భాగాలను తీసుకొని మిగిలిన భాగాల మట్టిని తొలగించాలి. చివరికి అందులో ఒక కిలో మట్టి వచ్చేలా ప్యాకింగ్ చేయాలి. మట్టి సేకరణ సమయంలో పొలం గట్ల వద్ద, పంట కాలువల్లోనూ, చెట్ల కింద పొలం భాగంలోనూ మట్టి సేకరించరాదు. పొలంలో ఎరువు, మట్టి కుప్పలు వేసిన చోట నీరు నిలబడే పల్లపు ప్రాంతాల్లో మట్టి సేకరించరాదు. రైతులు తమ పొలాల్లో చౌడు ప్రాంతంగా ఉన్నట్టు అనుమానం కలిగితే అక్కడ ప్రత్యేకంగా మట్టిని సేకరించి పరీక్షలకు పంపాలి. సేకరించిన మట్టిని బాగా గాలికి ఆరిన తరువాత మంచి ప్లాస్టిక్ సంచిలో కానీ, చిన్నపాటి సంచిలో గానీ నింపి భూసార పరీక్ష కేంద్రానికి పంపాలి. భూసార పరీక్షల ఫలితాల ఆధారంగా పంటలు సాగు చేస్తే మంచి దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు.



నువ్వూరుపాడు పొలాల్లో రైతులతో కలిసి మట్టిని సేకరిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు (ఫైల్)

రైతు సేవా కేంద్రాల్లో మట్టి నమూనాల సేకరణ

గ్రామ సచివాలయాల పరిధిలో ఉన్న రైతు సేవా కేంద్రాల నుంచి మట్టి నమూనాలు సేకరించేందుకు ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. 2024–25 సంవత్సరానికి గాను నేలలోని పోషకాల శాతం చౌడు భూముల పునరుద్ధరణ, సాగు చేయబోయే పంటలకు కావాల్సిన ఎరువుల మోతాదును తెలుసుకొనేందుకు మండలాల వారీగా మట్టి నమూనా సేకరణకు లక్ష్యాలు నిర్దేశించింది. ఆత్మకూరు మండలానికి సంబంధించి 767 మట్టి నమూనాలు సేకరణకు లక్ష్యంగా నిర్ణయించారు. ఆయా గ్రామాల రైతులు తమ భూముల్లో మట్టి నమూనా పరీక్షలు చేయించుకొనేందుకు రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించవచ్చు.

సద్వినియోగం చేసుకోవాలి



ఆధార్, పట్టాదారు పాసుపుస్తకం జెరాక్స్‌లతో రైతు సేవా కేంద్రం అధికారులను సంప్రదిస్తే అక్కడి సిబ్బంది రైతుల పొలాల వద్దకు వచ్చి మట్టి నమూనాలు సేకరిస్తారు. సేకరించిన మట్టిని నెల్లూరులోని భూసార పరీక్ష కేంద్రానికి పంపి పరీక్షల ఫలితాలను ఆయా పొలాల్లో సాగు చేసుకోదగిన పంటల వివరాలను కూడా రైతులకు తెలియజేస్తారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

– కిషోర్, మండల వ్యవసాయ అధికారి, ఆత్మకూరు

విద్యతోనే ఉజ్వల భవిష్యత్

జలదంకి: విద్యార్థులు బాగా చదువుకోవాలని, అప్పుడే వారికి ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఎంఈఓ–2 సీహెచ్ నాగేశ్వరరావు పేర్కొన్నారు. మంగళవారం జలదంకి మండలంలోని బ్రాహ్మణక్రాక ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో 'నేను బడికి పోతా, విద్యా ప్రవేశం' కార్యక్రమాల్లో భాగంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించి మానవహారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ అక్షరాస్యులైనప్పుడే పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందుతారని తెలిపారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన విద్యను బోధించాలని సూచించారు. హెచ్‌ఎం జయలలిత మాట్లాడుతూ ఉపాధ్యాయులు తల్లిదండ్రులకు చదువు విశిష్టతను వివరించి వారి పిల్లలను పాఠశాలలో చేర్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం 10 మంది డ్రాపౌట్ విద్యార్థులను పాఠశాలలో చేర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

సంతానలక్ష్మి ఆలయంలో పూజలు

ఉదయగిరి: పట్టణంలోని బీసీకాలనీ సమీపంలో ఉన్న శ్రీసంతానలక్ష్మి అమ్మవారి ఆలయంలో ఉత్సవాలు నిర్వహించి 16 రోజులు పూర్తయిన సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు అమ్మవారికి అభిషేకాలు, అలంకరణ, విశేష పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని నైవేద్యాలు సమర్పించారు.

నడింపల్లెలో..

ఉదయగిరి మండలం అప్పసముద్రం పంచాయతీ నడింపల్లి గ్రామంలో గత మూడు రోజులుగా జరుగుతున్న శ్రీసీతారాముల ఉత్సవాలు మంగళవారం వైభవంగా ముగిశాయి. చివరి రోజు వసంతోత్సవం, ఉట్టికొట్టడం, పార్వేట వేడుకలు నిర్వహించారు. భక్తులు సీతారాములను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



ప్రత్యేక అలంకరణలో సంతానలక్ష్మి అమ్మవారు

జి.కొండారెడ్డిపల్లెలో 104 వైద్యసేవలు

వరికుంటపాడు: మండలంలోని జి.కొండారెడ్డిపల్లె గ్రామంలో మంగళవారం 104 వాహనం ద్వారా వైద్యాధికారిణి ఆయేషా ఫ్యామిలీ డాక్టర్ వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా ఆమె వైద్యశిబిరంలో పలువురు రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందించి ఆరోగ్య సలహాలందించారు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు క్రమం తప్పకుండా మందులు వినియోగిస్తూ ఆరోగ్యాన్ని సంరక్షించుకోవాలని తెలిపారు. అనంతరం శిబిరానికి రాలేని వ్యాధిగ్రస్తుల ఇళ్లకు వెళ్లి ఆమె పరీక్షలు నిర్వహించారు. ఆమె వెంట వైద్యసిబ్బంది ఉన్నారు.

చేజర్ల: మండలంలోని పాడేరు సచివాలయంలో మంగళవారం 104 వాహన సిబ్బంది రోగులకు వైద్యసేవలు అందించారు. గ్రామంలోని 55 మందికి షుగర్, రక్తపరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు అందించారు. గర్భిణులు, బాలింతలకు ఆరోగ్య సూచనలిచ్చారు. కార్యక్రమంలో హెచ్‌వీ నరసమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ రత్నకుమారి పాల్గొన్నారు.



రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారిణి ఆయేషా

తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన

సీతారామపురం: తమ భూమి తమ ప్రమేయం లేకుండా ఇతరులకు ఎలా సంక్రమించిందో తెలపాలంటూ మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట వాడావీధికి చెందిన పలువురు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీతారామపురం గ్రామానికి చెందిన వాడా గోపయ్య అనే వ్యక్తికి సర్వే నంబర్ 536లో 5.69 ఎకరాల భూమి ఉందన్నారు. 2006వ సంవత్సరంలో గోపయ్య మరణించగా ఆ భూమిలోనే అతనిని సమాధి చేశారన్నారు. ఇటీవల కాలంలో వాడా గోపయ్య కుటుంబసభ్యులు స్థానికంగా లేకపోవడంతో కొందరు అక్రమార్కులు రంగప్రవేశం చేసి ఆ భూమిపై కన్నేసి రెవెన్యూ సిబ్బందితో కుమ్మక్కై రికార్డులు సైతం తారుమారు చేసి ఇతర జిల్లావాసులైన షేక్ మహబూబ్‌బీ పేరు మీద అక్రమంగా పట్టాదారు పాస్‌పుస్తకాలు పొందారని తెలిపారు. దీంతో వారు తమకు చెందిన భూమిలో ప్లాట్లు వేసేందుకు రంగం సిద్ధం చేసి తమ భూమిని కోట్ల రూపాయలకు విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో తమకు చెందిన ఆ భూమి పీర్ల మాన్యమని కొందరు, వెట్టిమాన్యమని కొందరు చెప్పుకుంటూ ఆ భూమిని కాజేసేందుకు ఎవరి ప్రయత్నాలు వారు ముమ్మరం చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా కలెక్టర్‌తోపాటు సంబంధిత శాఖ ఉన్నతాధికారులు స్పందించి పూర్వం నుంచి తమకు చెందిన భూమిని ఇతరుల చెర నుంచి విముక్తి కల్పించి న్యాయం చేయాలని కోరారు. అనంతరం పూర్తి ఆధారాలతో తహసీల్దార్ వెంకటకృష్ణారెడ్డికి వినతి పత్రం సమర్పించారు. అందుకు స్పందించిన తహసీల్దార్ మాట్లాడుతూ సర్వే నంబర్ 536లో భిన్నాలు ఏర్పడడంతో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని, దానిపై క్షేత్రస్థాయిలో నిశితంగా దర్యాప్తు జరిపి బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.



ఆందోళన చేస్తున్న వాడావీధి వాసులు

ప్రజాప్రతినిధుల స్థానంలో పార్టీ కార్యకర్తలా..?

- పింఛన్ల పంపిణీలో స్థానిక సంస్థల ప్రతినిధులను విస్మరించడం దారుణం
- ప్రజల నెత్తిన మళ్లీ జన్మభూమి కమిటీల కుంపటి

బిట్రగుంట: సామాజిక పింఛన్ల పంపిణీలో స్థానిక సంస్థల ప్రతినిధులను విస్మరించి టీడీపీ కార్యకర్తలతో లబ్ధిదారులకు నగదు పంపిణీ చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికే విరుద్ధమని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మద్దిబోయిన వీరరఘు అన్నారు. బోగోలులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంగళవారం ఆయన మాట్లాడారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే మళ్లీ జనం నెత్తిన జన్మభూమి కమిటీలను రుద్దేలా పింఛన్ల పంపిణీలో కార్యకర్తలకు పెత్తనం అప్పగించిందన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులకు కనీస ఆహ్వానం లేకుండా టీడీపీ సొంత కార్యక్రమంలా కార్యకర్తలతో పింఛన్లు పంపిణీ చేయించడం దారుణమని తెలిపారు. పంచాయతీరాజ్ చట్టం ప్రకారం రాజ్యాంగబద్ధంగా ఎన్నికైన సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులను ప్రభుత్వ కార్యక్రమాల్లో విస్మరించడం సరికాదన్నారు. గతంలో అధికారాన్ని అడ్డుపెట్టుకుని జన్మభూమి కమిటీలు చేసిన అరాచకాలను ప్రజలు ఇంకా మర్చిపోలేదని గుర్తుచేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మేకల సుజాత, జెడ్పీటీసీ సభ్యురాలు మద్దిబోయిన కీర్తన, మండల యువత అధ్యక్షుడు మేకల శ్రీనివాసులు, నాయకులు తూపిరి పెంచలయ్య, తుమ్మల రమణయ్య, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మద్దిబోయిన వీరరఘు

కొత్త చట్టాలపై అవగాహన

సోమశిల: అనంతసాగరం మండల పరిధిలో మంగళవారం సోమశిల పోలీస్‌స్టేషన్ ఎస్సై సుబ్బారావు ఆధ్వర్యంలో నూతన చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూలై 1వ తేదీ నుంచి నూతన చట్టాలు అమలులో ఉంటాయని, దీనిపై ప్రజలు అవగాహన కలిగి అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

అవగాహన తప్పనిసరి

సీతారామపురం: నూతన చట్టాలపై ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని ఎస్సై అనూష పేర్కొన్నారు. ఆమె మంగళవారం రాత్రి స్థానిక బస్టాండ్ సెంటర్‌లో నూతన చట్టాలపై ప్రజలకు వివరించారు. ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలందించడం, బాధితులకు న్యాయం చేయడమే నూతన చట్టాల ముఖ్య ఉద్దేశమని తెలిపారు. జీరో ఎఫ్ఐఆర్, పోలీస్‌స్టేషన్‌కు వెళ్లకుండానే ఆన్‌లైన్‌లో ఫిర్యాదులు, ఈ–మెయిల్స్, ఎస్ఎంఎస్‌లు లాంటి ఎలక్ట్రానిక్ ఉద్యమాలతో సమన్లు జారీ వంటి అత్యాధునిక విధానాలు న్యాయవ్యవస్థలోకి వచ్చాయన్నారు. నూతన చట్టాలు అమలు చేస్తూ భారత ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని, వాటిని అనుసరిస్తూ ముందుకు సాగాల్సి ఉంటుందన్నారు.



అమర సైనికులకు ఘన నివాళి

ఆత్మకూరు: ఇటీవల భారత్–చైనా సరిహద్దుల్లోని లఢాఖ్ ప్రాంతంలో ప్రమాదవశాత్తు యుద్ధ ట్యాంకు వాహనం నీటిలో పడిపోవడంతో అమరులైన భారతీయుల సైనికులకు ఆత్మకూరు పట్టణంలోని పలువురు బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్, విశ్వహిందూ పరిషత్ నాయకులు, కార్యకర్తలు ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమరులైన భారతీయ సైనికుల్లో ఇద్దరు తెలుగు వారు ఉన్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో మంగళవారం సాయంత్రం ఆత్మకూరు మున్సిపల్ బస్టాండ్ సెంటర్ నుంచి సత్రం సెంటర్ వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. దారి పొడవునా అమర సైనికులకు జోహార్లు పలికారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, రైతులు పాల్గొన్నారు.



కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

పగిలిన తాగునీటి పైపులైన్

- ప్రభుత్వ ఆస్పత్రి ట్యాంకుకు కలుషిత నీరు సరఫరా
- వారం అవుతున్నా మరమ్మతులు చేయని వైనం

ఆత్మకూరు: ఆత్మకూరు మున్సిపల్ పరిధిలో కోట్లాది రూపాయల వ్యయంతో ప్రత్యేక నీటి పంపిణీ పథకం ఏర్పాటైనా నిర్వహణ లోపం వెంటాడుతోంది. పలుచోట్ల పైపులైన్లు దెబ్బతింటున్నా.. తాగునీరు కలుషితమవుతున్నా పట్టించుకోని పరిస్థితి నెలకొంది. మున్సిపల్ పరిధిలోని ఆత్మకూరు–నెల్లూరుపాళెం మార్గంలో ఉన్న ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తాగునీరు సరఫరా అయ్యే పైపులైన్ సుమారు వారం రోజుల క్రితం పగిలి తాగునీరు వృథా అవుతున్నా అధికారులు దృష్టి సారించలేదని స్థానికులు మండిపడుతున్నారు. సెయింట్ మేరీస్ స్కూల్ ఎదురుగా ఈ పైపులైన్ దెబ్బతిని నీటి మడుగులు కట్టినా అధికారులు ఇంతవరకు దృష్టి సారించకపోవడం బాధాకరమని పట్టణ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పైపులైన్ దెబ్బతినడంతో ప్రభుత్వ ఆస్పత్రికి కలుషిత జలాలు సరఫరా అవుతున్నాయని, ఇది మరింత ప్రమాదకరమని, అధికారులు వెంటనే స్పందించి మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి సమీపంలో పైపులైన్ పగిలి వృథా అవుతున్న నీరు

డయేరియా నివారణపై అవగాహన

సంగం: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో డాక్టర్ శ్రీనివాసులురెడ్డి నేతృత్వంలో సంగంలో మంగళవారం డెంగీ, డయేరియా నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. పీహెచ్‌సీ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ కొనసాగింది. డయేరియా, డెంగీ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇళ్లలో నిల్వ ఉన్న నీటిని తొలగించాలన్నారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

జాగ్రత్తలు తీసుకోండి

చేజర్ల: డయేరియా వ్యాధిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చేజర్ల పీహెచ్‌సీ వైద్యులు మెహతాబ్ సూచించారు. మంగళవారం చేజర్లలోని పీహెచ్‌సీలో ఆశా కార్యకర్తలతో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. డయేరియా నివారణకు జింక్ మాత్రలు వాడాలన్నారు. చేతులు శుభ్రంగా కడుక్కోవాలని, సురక్షితమైన తాగునీరు తాగాలని సూచించారు. ఆగస్టు 31వ తేదీ వరకు డయేరియాపై ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ చంద్రయ్య పాల్గొన్నారు.

వరికుంటపాడు: డయేరియా సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యసిబ్బంది గ్రామాల్లో ఆగస్టు 31వ తేదీ వరకు ఇంటింటికి తిరిగి అవగాహన కల్పించాలని మండల వైద్యాధికారి కరిష్మా పేర్కొన్నారు. ఆమె మంగళవారం స్థానిక వైద్యశాలలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 18వ తేదీ నుంచి జరిగే లెప్రసీ సర్వేను బాధ్యతగా నిర్వహించాలన్నారు. అడల్ట్ బీసీజీ టీకా కార్యక్రమాన్ని నూరు శాతం పూర్తి చేయాలని తెలిపారు. సమావేశంలో సీహెచ్‌ఓ రాజశేఖర్‌రాజు, పీహెచ్‌ఎన్ సుశీలమ్మ, సూపర్‌వైజర్ వెంకటయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రాధాన్యతా క్రమంలో ప్రగతి సాధించాలి

- మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

ఆత్మకూరు: ఆత్మకూరు నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుండేలా చేయాలని, అధికారుల వల్లనే అది సాధ్యమని, ప్రాధాన్యతా క్రమంలో ప్రగతి సాధించేందుకు ప్రతి ఒక్కరూ సమష్టి కృషితో సహకరించాలని రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి కోరారు. పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ కె.మధులతతో కలిసి నియోజకవర్గంలోని అన్ని శాఖల అధికారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ముఖ్యంగా రెవెన్యూ, మున్సిపల్ ఇరిగేషన్, ఆర్‌అండ్‌బీ శాఖల అధికారులతో విస్తృతంగా చర్చించారు. తొలుత నెల్లూరు–ముంబై రహదారి పక్కనే ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను పరిశీలించి అక్కడ ప్రిన్సిపల్ అడ్మినిస్ట్రేటర్ అధ్యాపకులతో కళాశాల పరిస్థితులు, కావాల్సిన వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం పట్టణంలోని ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ అతిథి గృహాలను ఆయన సందర్శించారు. తదుపరి ఆర్డీఓ కార్యాలయ సమావేశ మందిరంలో సమీక్ష నిర్వహించారు. ముఖ్యంగా ఆత్మకూరు మున్సిపాలిటీ అధ్వానంగా ఉందని, అధికారుల పర్యవేక్షణ కొరవడిందన్నారు. అదే క్రమంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల, సమీపంలోని ప్రభుత్వ ఐటీఐ, బాలికల గురుకుల పాఠశాల, బాలుర వసతి గృహాలకు తాగునీటి సౌకర్యం మున్సిపాలిటీ కల్పించకపోవడం దారుణమన్నారు. ఈ కళాశాలల భవనాలకు సమీపంలోనే రెండు లక్షల లీటర్ల సామర్థ్యం గల వాటర్ ట్యాంకు ఉన్నా ఆ కళాశాలలకు తాగునీరు అందించకపోవడం పట్ల ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ రెండు వారాల్లో తాగునీటి వసతిని ఏర్పాటు చేసి నివేదికలు ఇవ్వాలని కమిషనర్ ఫజులుల్లాను ఆదేశించారు. పంచాయతీ రాజ్ అతిథి గృహం శిథిలావస్థకు చేరుకుందని, దానిని తొలగించి ఆధునిక వసతులతో నూతన నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాలని పీఆర్ అధికారులకు సూచించారు.



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

వెంకయ్యనాయుడుని కలిసిన నేతలు



ఆత్మకూరు: ఆత్మకూరుకు చెందిన బీజేపీ నాయకులు మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడును హైదరాబాదులోని ఆయన నివాసంలో మంగళవారం కలిశారు. ఇటీవల వెంకయ్యనాయుడు జీవిత చరిత్ర పుస్తకాలను ప్రధాని నరేంద్రమోదీ ఆవిష్కరించగా.. ఆ పుస్తకాలను వెంకయ్యనాయుడు నాయకులకు అందజేశారు. కార్యక్రమంలో సురేంద్రరెడ్డి, కుడుముల సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అంకాల పరమేశ్వరి ఉత్సవాలు

వరికుంటపాడు: మండలంలోని కాకొల్లువారిపల్లె గ్రామంలో గత రెండు రోజులుగా జరుగుతున్న గ్రామదేవత శ్రీఅంకాల పరమేశ్వరి అమ్మవారి జాతర ఉత్సవాలు మంగళవారంతో వైభవంగా ముగిశాయి. చివరి రోజు గ్రామదేవతను ప్రత్యేకంగా అలంకరించి శేష పూజలు నిర్వహించారు. అమ్మవారిని భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. బండ్లు పొంగళ్లు నిర్వహించి అమ్మవారిని నైవేద్యాలు సమర్పించారు.

పేకాట స్థావరంపై దాడి

సోమశిల: అనంతసాగరం గ్రామ శివార్లలో ఉన్న అంకాలమ్మ దేవాలయం సమీపంలో పేకాట ఆడుతున్నారనే సమాచారంతో మంగళవారం అనంతసాగరం ఎస్సై సూర్యప్రకాష్‌రెడ్డి సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఐదుగురు పట్టుబడ్డారని ఎస్సై తెలిపారు. వారి వద్ద నుంచి రూ.5,330 నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరచనున్నట్లు తెలిపారు.

వీఆర్వోకు సన్మానం



అల్లూరు: అల్లూరు పేట వీఆర్వోగా పనిచేస్తున్న షేక్ సలాం ఉద్యోగ విరమణ కార్యక్రమం మంగళవారం స్థానిక కార్యాలయంలో నిర్వహించారు. తహసీల్దార్ దుర్గేశ్వర్‌రావు, రెవెన్యూ సిబ్బంది ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ నాగలక్ష్మి, సీనియర్ అసిస్టెంట్ సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

బీద మస్తాన్‌రావు జన్మదిన వేడుకలు



అల్లూరు: రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు పుట్టినరోజును పురస్కరించుకుని మంగళవారం ఆయన స్వగ్రామం అయిన అల్లూరు మండలం ఇస్కపల్లిలో నాయకుడు బీద రమేష్‌బాబు ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. కేక్‌ను కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. కార్యక్రమంలో వెంకయ్య, మహీధర్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అమ్మకు గుర్తుగా ఒక మొక్క నాటండి



మొక్క నాటుతున్న నాయకులు

ఆత్మకూరు: ప్రధాని నరేంద్రమోదీ ఇచ్చిన పిలుపు మేరకు పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా ప్రతి ఒక్కరూ అమ్మకు గుర్తుగా ఒక మొక్క నాటి సంరక్షించాలని బీజేపీ నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం ఆత్మకూరు పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు కె.సుధాకర్ ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా తమ ఇళ్లలో మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల తనిఖీ



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఏపీసీ ఉషారాణి

సోమశిల: అనంతసాగరం మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలను మంగళవారం ఏపీసీ ఉషారాణి తనిఖీ చేశారు. తొలుత గౌరవరం పాఠశాలలో విద్యార్థులకు యూనిఫాం పంపిణీ చేసి తల్లిదండ్రుల కమిటీ సమావేశం నిర్వహించారు. పాఠశాల అభివృద్ధిలో తల్లిదండ్రుల కమిటీ పాత్రను వివరించారు. అనంతరం కామిరెడ్డిపాడు, మంగుపల్లి పాఠశాలలను పరిశీలించిన ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్, నేను బడికి పోతా కార్యక్రమంపై ఉపాధ్యాయులతో సమీక్షించారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకం నిర్వహణను పరిశీలించి ఉపాధ్యాయులకు తగు సూచనలిచ్చారు. ఆమె వెంట ఎంఈఓ–1 జానకీరాం, ఎంఈఓ–2 కాటంరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

విద్యుత్ హెల్పర్ల నిర్లక్ష్యం



నిరుపయోగంగా పడి ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

చేజర్ల: విద్యుత్ హెల్పర్ల నిర్లక్ష్యం కారణంగా రూ.లక్ష విలువ చేసే ట్రాన్స్‌ఫార్మర్ నిరుపయోగంగా పడి ఉన్న ఘటన చేజర్ల మండలంలోని మాముడూరు గ్రామంలో జరిగింది. ట్రాన్స్‌ఫార్మర్ నిర్లక్ష్యానికి గురికావడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ విషయంపై విద్యుత్ అధికారులు చొరవ చూపాలని గ్రామస్తులు కోరుతున్నారు.

గేదెను ఢీకొని ద్విచక్ర వాహనదారుడికి గాయాలు

సోమశిల: అనంతసాగరం మండల పరిధిలోని ఉప్పలపాడు వద్ద జాతీయ రహదారిపై ఓ ద్విచక్ర వాహనదారుడు గేదెను ఢీకొని తీవ్రగాయాల పాలైన ఘటన మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. ఉదయగిరి మండలం గంగిరెడ్డిపాళేనికి చెందిన డి.శ్రీనివాసులు స్వగ్రామం నుంచి సోమశిలకు వస్తుండగా ప్రమాదం జరిగి తీవ్రగాయాలు కావడంతో చికిత్స నిమిత్తం 108 వాహనంలో ఆత్మకూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడి నుంచి నెల్లూరుకు తరలించారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి ప్రమాదానికి గల కారణాలను తెలుసుకున్నారు.

ఉద్యోగుల అసోసియేషన్ ఎంపిక



కావలి: ఏపీ ఎన్జీవోస్ కావలి తాలూకా యూనిట్ సమావేశం కావలి మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఏపీ ఎన్జీవోస్ సంఘం నాలుగో తరగతి ఉద్యోగుల అసోసియేషన్ ఎంపిక నిర్వహించారు. జిల్లా ఏపీ ఎన్జీవో సంఘం అధ్యక్షుడు, కార్యదర్శుల ఆదేశాల మేరకు కావలి పట్టణం ఆంధ్రప్రదేశ్ 4వ తరగతి ఉద్యోగుల అసోసియేషన్ నెల్లూరు జిల్లా అధ్యక్షుడు కె.సందీప్ చక్రవర్తి, కార్యదర్శి విద్యాసాగర్, రాష్ట్ర గౌరవాధ్యక్షుడు జి.నాగేశ్వరరావు అధ్యక్షతన ఈ ఎంపిక జరిగింది. అధ్యక్షులుగా చింతపూడి రవి, అసోసియేట్ అధ్యక్షుడు షేక్ గయాజ్, ఉపాధ్యక్షుడు ఎం.శ్రీకుమార్, ప్రధాన కార్యదర్శి కె.కనకాద్రి, అసోసియేట్ కార్యదర్శి ఎస్‌డీ జమీలా, ఎ.సురేష్, ట్రెజరర్ బుట్టి శ్రీనాథ్‌లను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఏపీఎన్జీవోస్ కావలి తాలూకా అధ్యక్షుడు ఎస్.శివకుమార్, కార్యదర్శి డీవీ నాగరాజు, ఉపాధ్యక్షుడు దీక్షితులు తదితరులు పాల్గొన్నారు.